# నీలి మంటలు

ఎండ నిప్పులు చెరుగుతోంది. ఎవరి మీదనో ప్రతీకారం తీర్చుకుంటున్నట్టుగా మండుతున్నాడు సూర్యుడు. తన ప్రతాపాన్ని సమస్త జీవకోటికీ చూపుతున్నాడు.

పక్షులు ఎగరటం లేదు. గూళ్ళలో రెక్కలు ముడుచుకుని భయం భయంగా బయిటకు చూస్తున్నాయి. ఎండ వేడికి చెట్లుకూడా బిగదీసుకు పోయాయి.

మధ్యాహ్నం పన్నెండు గంటలు కావస్తున్నప్పుడు అంతగా జన సంచారంలేని ఆ రోడ్డుమీద వాడు ఎగురుకుంటూ నడుస్తున్నాడు.

వాడి పాదాలకు చెప్పులులేవు. బూట్లులేవు. ఏమీలేవు. తారురోడ్డు మీద నడుస్తుంటే వాడి పాదాలు చుర్రుమంటున్నాయి. నిప్పుల మీద నడుస్తున్నట్టుగా వుంది. అందుకే వాడు అప్పుడప్పుడు రోడ్డువక్కనే వున్న కాగితాలమీద కూడా నడుస్తున్నాడు: కాళ్ళు కాలకుండా వుండటానికి.

ఆరేళ్ళు దాటి వుండదు వాడి వయసు. కొంచెం సన్నగా వున్నాడు చామనచాయలో వున్నాడు. లోతుకు పీక్కుపోయిన కళ్ళలో ఎండవేడి భరించలేక నీళ్ళు తిరుగుతున్నాయి. వీపుమీద పొడుగ్గా చిరిగిపోయిన చొక్కా అసలురంగు యేమిటో తెలీటంలేదు.

నిక్కరుకూడా చాలా చోట్ల చినిగిపోయి వుంది. ఉండుండి విసురుగా వీస్తున్న గాలికి ఎండిపోయినట్టున్న వాడి జుట్టు అటూ ఇటూ ఎగిరి పడుతోంది. వాడి వొళ్ళంతా చెమటతో తడిసిపోయింది.

అప్పుడప్పుడు వాడికి చెప్పులు, బూట్లు లాడుక్కుని తాపీగా నడిచివస్తున్న మనుషులు ఎదురైనారు. ఎక్కువమంది వాడి గురించి పట్టించుకోలేదు. కొంతమంది చుర్రుమంటున్న పాదాలతో నృత్యం చేస్తున్నట్లుగా ఎగురుకుంటూ నడుస్తున్న వాడ్ని చూసి నవ్వుకుంటూ వెళ్ళిపోయారు.

వాడిచేతిలో సొట్టలుపడిన సత్తు బొచ్చెవుంది. అందులో ఒక్క మెతుకు కూడా లేదు.

ఎవ్వరూ వెయ్యలేదు.

వాడికి కడుపులో ఆకలి బయిటి ఎండలాగే మండుతోంది. పొద్దుటి నించీ వాడేమీ తినలేదు. అందుకే అంత ఎండలోనూ ఇంకా రోడ్లమీద తిరుగుతున్నాడు.

నడుస్తున్న వాడల్లా ఆగిపోయాడు. వాడు నిల్చున్నచోట రోడ్డు పక్కనే ఏదో వెడల్పాటి ఆకులున్న చెట్టువుంది. దాని ఆకులు కొన్ని కింద రాలి వున్నాయి.

బొచ్చెను పక్కనే పెట్టుకుని కింద కూర్చున్నాడు. కిందపడిన ఆకుల్ని తీసుకుని చేత్తో గట్టిగా నలిపి వాటిని మండుతున్న అరికాలి మీద పిండుకున్నాడు. రెండు మూడుబొట్లు ఆకురసం కాలిమీద పడింది. ఎంతో హాయిగా వున్నట్లనిపించింది.

చల్లగా వుంది.

గబగబా ఇంకో నాలుగు పచ్చగావున్న ఆకులను ఏరుకుని అలాగే రసం పిండుకున్నాడు కాళ్ళమీద.

చెట్టుకింద సుఖంగా వుంది. అక్కడినించి కదలాలని అనిపించ లేదు. ఎండలోకి చూస్తూంటే భయంగా వుంది.

ఉన్నట్టుండి వాడికి కడుపులో ఆకలి గుర్తుకువచ్చింది. సత్రం దగ్గర చెట్టుకింద తనకోసం, తను అడుక్కుని తీసుకెళ్ళే అన్నము కోసం ఎదురుచూసే ముసిల్దికూడా గుర్తుకువచ్చింది.

మళ్ళీ నిల్చున్నాడు.

అయిష్టంగానే రోడ్డుమీదకు ఎండలోకి వచ్చాడు. చురుక్కు-మన్నాయి పాదాలు.

డాన్స్ చేస్తున్నట్టు ఎగురుకుంటూ నడక మొదలుపెట్టాడు.

నడుస్తున్న వాడల్లా ఒక ఇంటి ముందు ఆగిపోయాడు. ఆ ఇంటి తలుపులు తెరిచివున్నాయి. ఎదురుగా మనుషులు కనిపించలేదు.

కింద కాళ్ళు కాలుతూనేవున్నాయి.

బొచ్చెమీద చేత్తో చప్పుడు చేశాడు.

ఆ చప్పుడే వాడి పిలుపు.

అదే వాడి నోరు.

అదే వాడి మాట.

వాడిపిలుపును ఎవ్వరూ ఆలకించలేదు. ఇంకొంచెంసేపు వాడలా నిల్చునే వున్నాడు. చప్పుడు చేస్తూనే వున్నాడు.

ఉన్నట్టుండి లోపలి గదిలోనించి బాగా లావుగావున్న ఒకామె రేగిపోయిన జుట్టుతో అరుచుకుంటూ బయటకు వచ్చింది.

ఆమెను చూడగానే వాడికి భయమేసింది. అక్కడినించి రోడ్డు మీదకు పరుగుదీశాడు

వాడికి గొంతు ఎండుకుపోయి దాహంగా వుంది. ఆకలిగా వుంది. నీరసంగా వుంది.

అన్నిటినీ మించి సెగలు కక్కుతున్న వేడి వాడి ప్రాణాలు తీస్తోంది.

ఒక గోడమీద వాడికి రంగు రంగుల సినిమా పోస్టర్లు కన పడ్డాయి.

వాటిమీద సగం బట్టలు విడిచేసిన అమ్మాయి బొమ్మ వాడిని అంతగా ఆకర్షించలేదు. కాని ఆ పక్కనేవున్న ఇద్దరి మనుషులు కొట్టు కుంటున్న చిత్రం వాడికి బాగా నచ్చింది.

కళ్ళుమండేసరికి ఈ లోకంలోకి వచ్చి అక్కడినించి కదిలాడు.

రెండు రిక్షాలు వాడికి ఎదురు వచ్చాయి. అందులో కూర్చున్న మనుషులను చూసి వాడుకూడా రిక్షాలో ఎక్కి అడుక్కుంటే బావుండు ననుకున్నాడు.

రిక్షాలు దాటిపోయాయి.

మరో రోడ్డులోకి తిరిగాడు. ఆ మలుపులో వున్న మొదటి ఇంటి గేటు తెరిచివుంది. గోడకు అవతలి వైపునవున్న మామిడిచెట్టు నీడ గేటు దగ్గరకు పడుతోంది.

ఆ ఇంట్లోకి వెళ్ళాడు.

ఆ ఇంటి వరండాలో కుర్చీల్లో కూర్చుని అతను-ఆమె మాట్లాడు కుంటున్నారు చిన్నగా.

ఆమె ఏడుస్తున్నట్టుగా కన్నీళ్ళు తుడుచుకుంటోంది. అతని మొహంకూడా విచారంగా వుంది. వాళ్ళిద్దరూ ఏదో విషయం గురించి తీవ్రంగా బాధపడుతున్నట్టుగా వున్నారు.

ఇదేమీ గమనించలేదు వాడు.

చెట్టునీడ కన్నతల్లి ప్రేమలా చల్లగా వుంది. ఆ నీడలో నిలబడి చెట్టుకొమ్మలకు వేల్లాడుతూన్న మామిడి పిందెలను చూస్తు న్నాడు తలపైకెత్తి.

వాళ్ళిద్దరూ వాడిని చూశారు.

ఆమెకైతే వాడినిచూడటంలోనే దుఃఖం పొంగివచ్చింది. సరిగ్గా ఏడాది క్రితం అదే రోజున తీవ్రమయిన జ్వరంతో కళ్ళుమూసిన ఒకే ఒక్కకొడుకు బాబు ఒక్కసారిగా కళ్ళముందు కదిలినట్లనిపించింది.

అతనిక్కూడా అలాగే అనిపించింది.

అవును. బాబుకూడ సరిగ్గా ఇదే వయసులో వున్నప్పుడు పోయాడు. ఇదే ఎత్తు- లావు- చామనచాయలో వుండేవాడు.

"ఏమండీ! వీడెవడో అచ్చం బాలిగాడిలా వున్నాడు కదండీ" అన్నదామె పూడుకుపోతున్న గొంతుతో- వాడినే చూస్తూ....

"అవును" అన్నాడతను చెమ్మగిల్లిన కళ్ళతో.

ఆకలి సంగతికూడా మరచి వాడు మామిడి ఆకులను ఏరుకుని పాదాలమీద రసం పిండుకుంటున్నాడు.

"పాపం వాడి కాళ్ళు ఎండకు మాడిపోయాయి. ఆకుపసరు పిండుకుంటున్నాడు" అన్నదామె.

ఆ దృశ్యాన్ని చూస్తూంటే ఆమె హృదయం మరీ ద్రవించి పోయింది. చనిపోయిన తన బాబే బతికివుండి ఎదురుగా అలా చేస్తు న్నట్లుగా అనిపించింది.

బాబు!....

ఎన్నో యేళ్ళ తమ కలలపంట. దేవుడిచ్చిన వరం.... ఎంత అల్లారుముద్దుగా పెరిగాడు! ఎంతటి ఆనందాన్ని పంచిఇచ్చాడు! వాడి మీద ఎన్నో ఆశలు.... వాడి బంగారు భవిష్యత్తు గురించి ఎన్నో రంగుల స్వప్నాలు. చివరికి వాటన్నింటినీ కాల్చివేసి సముద్రమంత చీకటిని మిగిల్చి తను ఏవో లోకాలకు ఎగిరిపోయాడు.

సరిగ్గా సంవత్సరమయ్యింది.

బాబు జ్ఞాపకాలు ఆ ఇద్దరినీ విచార సముద్రంలో ముంచు తున్నాయి.

హటాత్తుగా లోపలకు వచ్చినవాడిని చూడగానే ఆ యిద్దరికీ చనిపోయిన బాబు తిరిగి వాడిరూపంలో వచ్చినట్టుగా అనిపించింది.

ఉన్నట్టుండి వాడు తలెత్తి వాళ్ళని చూశాడు.

దగ్గరకు రమ్మని ఆమె వాడిని పిల్చింది.

ఆమె వాడికళ్ళకు మంచి మనిషిలా అగుపించింది. అందుకే బొచ్చెను అక్కడేవుంచి దగ్గరగా వెళ్ళాడు.

"నీ పేరేమిటి?" అడిగింది వాడినే పరీక్షగా చూస్తూ.

తనకు మాటలు రావన్నట్టు వాడు సైగచేసి చూపాడు.

ఆమె ఒక్కక్షణం విస్తుబోయింది.

వీడు మూగవాడా?!

ఇక ఆపైన వాడిని ఆమె ఏమీ అడగలేదు. ఇంట్లోకి వెళ్ళి అరిటాకులో అన్నం పెట్టుకువచ్చి మామిడిచెట్టు కింద వుంచింది.

వాడికళ్ళు నక్షత్రాల్లా మెరిశాయి.

వాడిలో విలయతాండవం చేస్తున్న ఆకలంతా ఒక్కసారిగా విజృంభించింది.

గబగబా ఆకులో పెట్టినదంతా తిన్నాడు.

కడుపునిండుగా నీళ్ళు తాగాడు.

వాడలా ఆకలితో ఆత్రంగా అన్నాన్ని తినటం చూస్తే ఆమె కడుపు తరుక్కుపోయింది. వాడిలో ఆమెకు పూర్తిగా తన బాబే కన పడుతున్నాడు.

ఆకలి చల్లారిన తర్వాత వాడు బొచ్చె పట్టుకుని నిలబడ్డాడు.

ఆమె దప్పున ఏదో గుర్తుకువచ్చి వాడిని అక్కడే వుం మన్నట్టు సైగచేసి ఇంట్లోకి వెళ్ళి ఎర్రని బూట్లజతతో బయటకు వచ్చింది.

వాటిని చూడగానే అతని హృదయం కలుక్కుమన్నది. సరిగ్గా బాబు చనిపోవటానికి వారంరోజుల ముందు షాపుకు తీసుకెళ్ళి తనే ఆ ఎర్రని బూట్లు కొన్నాడు.

బూట్లు వాడికిచ్చి వేసుకోమన్నది. వాడు వేసుకోబోయాడు కాని సాధ్యం కాలేదు. చివరకు ఆమే వాడి పాదాలకు ఆ బూట్లుతొడి గింది. వాడికోసమే కొన్నట్టుగా సరిగ్గా సరిపోయాయి.

ఆ బూట్లు వాడికి వింతగా వున్నాయి. ఎర్రని ఎరుపురంగులో వున్నాయి. వాటిమీద రంగురంగుల బొమ్మలు వున్నాయి.

కొత్తగావుంది వాడికి.

ఆమెకు తృప్తిగా వుంది.

తన కొడుకే ఆరోజున వాడిరూపంలో వచ్చాడనుకుంది. కొడుకు జ్ఞాపకార్థం మిగుల్చుకున్న ఆ బూట్లనికూడా వాడికిచ్చేసింది.

కొంచెంసేపటి తర్వాత వాడు ఎర్రని బూట్లువేసుకుని ఎంతో తాపీగా రోడ్డుమీదకు వచ్చాడు.

వాడికి కాళ్ళు చుర్రుమనలేదు.

బూట్లలో నడవటం చేతకాలేదు. ఏమిటోగా వుంది. అడుగులు వంకరటింకరగా పడుతున్నాయి. నడుస్తూనే ఆ ఎర్రని బూట్లను వింతగా- గర్వంగా- గొప్పగా చూసుకుంటున్నాడు.

ఏదోగా వుంది. వాడి జీవితంలో మొదటిసారిగా బూట్లు వేసు కోవటం.

కాళ్ళు కాలకపోయినా ఎండ మిగిలిన శరీరాన్ని మాడ్చేస్తోన్నది.

వేడిగాలి రివ్వున వీస్తోంది.

చేతిలో వున్న ఖాళీ బొచ్చెను చూసుకోగానే వాడికి హటాత్తుగా సత్రంలో తను తీసుకువెళ్ళే అన్నం కోసం ఎదురుచూసే ముసిల్ది గుర్తుకు వచ్చింది.

ఆ ముసిల్ది వాడికేమీకాదు. ఏమవుతుందో తెలీదు. ఏ వరసలో ఐనా పిలవటానికి వాడికి నోరులేదు. వాడిని ఎవరుకన్నారో తెలియదు. ఎలా పెరిగాడోగుర్తులేదు. ఆ ముసిల్ది వూహతెలిసిన దగ్గర్నించీ తన తోనే తిప్పుకుంటోంది. వాడు అడుక్కొచ్చిన తిండితిని బతుకుతోంది. అదే వాళ్ళిద్దరి మధ్యవున్న బంధం.

ఆ వీధి చివర్లో ఇంటి తలుపులు తెరిచే వున్నాయి. ఆ ఇంటి ముందు నిలబడి బొచ్చెమీద చప్పుడు చేశాడు!

ముందు గదిలో కూర్చుని తీరిగ్గా తాంబూలం నములుతున్న ఒకామె తల తిప్పి వాడిని చూసింది. ఆమె చూసినప్పుడు వాడుకాళ్ళకు వున్న బూట్లను చూసుకుంటున్నాడు.

ఆమె చూపులుకూడా వాడి బూట్లమీదకు మళ్ళాయి.

వెంటనే ఆమె ఆశ్చర్యపడి "ఒరేయ్ విస్సిగా.... మన బుజ్జిగాడి ఎర్రబూట్లు లోపల వున్నాయో లేవో చూడండిరా" అన్నది.

బుజ్జిగాడంటే ఆమె మనవడు. ఆరేళ్ళవాడు.

రెండు నిముషా ు తర్వాత "వాడి బూట్లులేవే.... నీకు ఇప్పుడు ఎందుకు గుర్తుకొచ్చాయి ఎర్రబూట్లు?" అంటూ ఆ గదిలోకి వచ్చాడు ఆమె కొడుకు విశ్వనాథం.

"ఇంట్లో వుండవనే అనుకున్నాను. అదుగో ఆ గేటుదగ్గర నిలబడ్డ ముష్టివెధవ పొద్దుట ఎప్పుడో బుజ్జిగాడు బయటకు వెళ్ళినప్పుడు

కాజేసి వుంటాడు. ఇప్పుడు ఆ బూట్లేసుకుని దర్జాజగా అడుక్కోటానికి వచ్చాడు" అన్నది.

"అవును అవి మన బుజ్జిగాడి బూట్లే, అనుమానంలేదు" అన్నాడు విశ్వనాథం వాటిని చూసి....

"ఉండు నేనో పనిచేస్తాను" అని ఆమె లోపలకు వెళ్ళి ప్లేటులో అన్నం పెట్టుకుని బయటకు వచ్చి "ఇటు రారా అబ్బాయ్" అని పిల్చింది.

ఆశగా వాడు లోపలకు వచ్చాడు - ఆ అన్నం తీసికొని ముసిల్దాని దగ్గరకు వెళ్ళిపోవచ్చు అనుకుంటూ.

వాడు దగ్గరగా రాగానే విశ్వనాథం గబుక్కున వాడి చెయ్యి పట్టుకుని "ఒరేయ్ మర్యాదగా ఈ బూట్లు ఎప్పుడు కాజేశావో చెప్పు" అనడిగాడు కళ్ళు పెద్దవిచేసి.

వాడికి భయమేసింది.

మాటలు రావన్నట్టు సైగచేసి చూపించాడు.

"ఇదొక వేషం. నా సంగతి నీకు తెలీదు. నిజం చెప్పకపోతే చంపేస్తాను" బెదిరించాడు విశ్వనాథం వాడి చేతిని గట్టిగా నొక్కుతూ.

"వాడితో మాటలేమిటండీ.... కాళ్ళకున్న బుజ్జిగాడి బూట్లను వూడదీయించక" అన్నది లోపల్నించి వచ్చిన విశ్వనాథం భార్య.

"ఒరేయ్.... ముష్టి వెధవా.... ముందు బూట్లు వూడదియ్యరా"

ఆ బూట్లు తనవే అన్నట్టు సైగచేసి చూపాడు వాడు బెదురుతున్న కళ్ళతో....

"నరికేస్తాను ముష్టివెధవా.... అడుక్కుతినే వెధవ్వి.... ఇంత ఖరీదైన బూట్లు నువ్వు నీ జన్మకు కొనుక్కోగలవా? తియ్.... వూడదియ్...." మరింత గట్టిగా వాడిచేతిని నొక్కాడు విశ్వనాథం....

బాధతో కీచుమంటూ అరిచాడు....

వాళ్ళంతా తనని హింస పెడతారని తెలుసుకున్నాడు. అంతే. విశ్వనాధం చేతిని కొరికి విసురుగా బయటకు పరిగెత్తాడు.

బాధగా అరిచాడు విశ్వనాధం. అంతలోనే తేరుకుని తిరుతూ వాడివెనుకే పరుగుదీశాడు.

వెచ్చని గాలి రివ్వున వీస్తోంది.

శక్తికొద్దీ పరుగుదీస్తున్నాడు వాడు. పరిగెత్తుతూనే ఒక్కసారి వెనక్కు చూశాడు. విశ్వనాధం వస్తూనే వున్నాడు.

భయమేసింది.

తనని వదలడేమో?

సందుమలుపు తిరిగాడు. రాయితగిలి బోర్లాపడ్డాడు. బొచ్చె దూరంగా పడింది. కాలు - చెయ్యి చెక్కుకుపోయాయి. నెత్తురు బయటకు చిమ్మింది.

లేచాడు.... నెత్తురు చూచుకుంటే వాడికి యేడుపు వచ్చింది. ఏడుస్తూనే లేచి నిలబడి బొచ్చెతీసుకుని వెనక్కు చూడకుండానే పరుగు దీశాడు.

ఆ బూట్లు మోయలేనంత బరువుగా మారిపోయి వాడిని పాతాళానికి క్రుంగదీస్తున్నట్టుగా అనిపించింది.

ఇంకో రోడ్డులోకి తిరిగాడు. భరించలేనంతగా అలుపు వచ్చింది. అప్పటికే చాలా దూరం పరిగెత్తాడు. ఇక పరిగెత్తలేక ఆగిపోయాడు వెనక్కు చూశాడు. విశ్వనాధం కనబళ్ళేదు.

చెక్కుకుపోయిన కాలినీ, చేతినీ చూసుకున్నాడు. నెత్తురు కారుతూనే వుంది. ఆ తర్వాత బూట్లను చూసుకున్నాడు. దుమ్ము కొట్టుకుపోయాయి.

ఆ బూట్లను చూస్తేవాడికి భయం కలిగింది.

వాటిని వేసుకుని తనేదో గొప్ప నేరం చేసినట్టు అనిపించింది.

ఆ బూట్లు తనకు శత్రువులను పెంచుతున్నట్టూ వాళ్ళంతా తనని వెంట తరుముతున్నట్టూ అనిపించింది.

తను కాళ్ళకు బూట్లు వేసుకోకూడదేమో!

ఇక ఆబూట్ల భారాన్ని తను మొయ్యలేనని కూడా అనిపించింది. అంతే-

వాడు అలుపుతో రొప్పుతూనే ఒక్కో బూటునీ కాలినించి బల వంతంగా లాగి దగ్గర్లోనే వున్న కుళ్ళు కాలవలోకి విసిరేశాడు.

వాడికి సంతోషం అయ్యింది.

తృప్తిగా వుంది. గొప్ప బరువు- బాధ్యత తీరిపోయినట్లనిపించింది.

ఉన్నట్టుండి వాడి కాళ్ళు చుర్రుమన్నాయి వేడికి. అయినా వాడికి అదేమంత బాధగా అనిపించలేదు.

మళ్ళీవాడు మండుతున్న ఎండలో సెగలు కురిపిస్తున్న తారు రోడ్డుమీద ముసిలాని తిండికోసం బొచ్చెపట్టుకుని నృత్యం చేస్తున్నట్టుగా ఎగురుకుంటూ నడుస్తూ వెళుతున్నాడు.

*

(1986 జనవరి 'స్వాతి' మాసపత్రిక)

(స్వాతి మాసపత్రిక కథల పోటీల్లో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ)